

కట్టడానికి కుస్తీ!

పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరిసే ఉద్దేశంతో గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. 8లో▸



ఇరుకు గది ఇబ్బందులు పడి

దౌల్తాబాద్ సింగిల్ విండో కార్యాలయ సిబ్బంది ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



అక్రమాలపై ఆగ్రహం

గత ఏడాది జరిగిన ఉపాధి పనుల్లో గోల్ మాల్ జరిగిందని కూలీలు, ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ నమోదులో తప్పులుండొద్దు

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



ఆన్‌లైన్ నమోదు వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: మహాలక్ష్మి పథకం కోసం ప్రజలు ఇచ్చిన దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సిబ్బందికి సూచించారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో, మండలంలోని నారాయణపూర్‌లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ. 500లకు గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. శనివారంతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారుల నేతృత్వంలో గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రత్యేక టీంలు పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎంపీ నాగరాజు, మున్సిపల్ టీపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి తరలించండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ మిగులు బియ్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులతో సీఎంఆర్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022- 23 సంవత్సరానికి వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన మిగులు సీఎంఆర్ బియ్యాన్ని ఈ నెల చివరి నాటికి ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు సీఎంఆర్‌ను రీసైక్లింగ్ పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారులు తమ పరిధిలోని మిల్లర్లను సందర్శించి బియ్యం నిల్వలను పరిశీలిస్తారని తెలిపారు. మిల్లుల్లో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి నివేదికలు అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, మేనేజర్ కొండలరావు, రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్‌అర్బన్/తాండూరు: తాండూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపాదికన వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరులో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ 2 పోస్టులు ఉండగా పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లమా అండ్ కంప్యూటర్ అప్లికేషన్, బ్యాచిలర్ ఇన్ కంప్యూటర్ సైన్స్ విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. రికార్డ్ అసిస్టెంట్ 2 పోస్టులు, హౌస్ కీపర్ నాలుగు పోస్టులకు డిగ్రీ అర్హత, అసిస్టెంట్ లైబ్రరీ పోస్టుకు డిగ్రీ లేదా డిప్లమా ఇన్ లైబ్రరీ సైన్స్ చదివి ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 6, ల్యాబ్ అటెండెంట్ 5, లైబ్రరీ అటెండెంట్ 3 పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. హెవీ వెహికల్ డ్రైవర్ ఒక పోస్టుకు పదో తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలని, మరో డ్రైవర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రానిక్స్ లేదా డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణత కలిగిన వారికి ఒక పోస్టు ఉన్నందున అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 18నుంచి 43 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో రెండు జతల దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు తాండూరు కళాశాల లో సమర్పించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 99481 76126లో సంప్రదించాలని సూచించారు.

జీఓ నం.69కి జీవం

కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం

- రూ.2,945 కోట్లు మంజూరు
- 3 నియోజకవర్గాల్లో 1.5లక్షల ఎకరాలకు సాగునీరు
- ప్రాజెక్టు నిర్మాణానికి పాలనా అనుమతులు



జూరాల ప్రాజెక్టు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీఓ నంబర్ 69కు జీవం పోశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసింది. బీమా ఎత్తిపోతల ద్వారా కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షల 50వేల మందికి తాగునీరు అందించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2014లో రాష్ట్ర విభజన జరిగి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పక్కన పెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం 69 జీఓను అమలు చేయకుండా అడ్డుకున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఈ ప్రాంతానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి చివరి ఆయకట్టు అయిన కొడంగల్‌కు సాగునీరు రాదని కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకం జలసాధన సమితి సభ్యులు ఇన్నాళ్లు పోరాటం చేశారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న 2014 - 2018 వరకు పలుమార్లు ఈ పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేశారు. అయినా పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2024లో ఈ పథకానికి ప్రాణం పోశారు. పథకం అమలుకు రూ.2945 కోట్లు మంజూరు చేశారు. 3 నియోజకవర్గాల్లో లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షలా 50వేల మందికి తాగునీరు అందించడానికి వీలుగా ప్రాజెక్టు నిర్మించాలని పరిపాలనా అనుమతులు జారీ చేశారు.

నాలుగు రిజర్వాయర్లు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మీదుగా కృష్ణానది ప్రవహిస్తూ తెలంగాణలో నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో తొలి ప్రాజెక్టు జూరాల. జూరాల నుంచి నికర జలాలతో మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోతల ద్వారా సాగు నీరు సరఫరా చేయనున్నారు. ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర రిజర్వాయర్లు నిర్మిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములకు సాగునీరు వదులుతారు.

పరిపాలనా అనుమతులు మంజూరు

కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రేవంత్ సర్కార్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీఓ నంబర్ 14 విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు ఇచ్చారు. ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లకు అనుమతి లభించింది. ఈ నిధులతో సర్వే, సమగ్ర అధ్యయనం, డిజైన్, భూసేకరణ, పర్యవేక్షణ తదితర పనులను చేయాల్సి ఉంటుంది.

ముందుకు సాగని 'పాలమూరు'

పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వల్ల కొడంగల్ నియోజకవర్గానికి ఉపయోగం లేదని జలసాధన సమితి సభ్యులు అంటున్నారు. శ్రీశైలం నుంచి మూడు వందల కిలోమీటర్ల దూరం సాగునీరు రావడం కష్టమన్నారు. పాలమూరు పథకంలో కొడంగల్ ప్రాంతం చివరి ఆయకట్టు అవుతుంది కాబట్టి సాగునీరు అందే అవకాశం లేదని చెబుతున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతలతోనే సాగునీరు తాగునీరు వస్తుందని నిధుల వ్యయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు. నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు మేలు జరగనుందని జలసాధన సమితి సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఇచ్చింది రూ.561 కోట్లే..

- యాసంగి పంట రుణ లక్ష్యం రూ. 1,532 కోట్లు
- లక్ష్యం చేరుకోని బ్యాంకర్లు
- సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా నామమాత్రంగానే వితరణ
- వానాకాలం సీజన్‌లోనూ ఇదే పరిస్థితి
- పంట పెట్టుబడి కోసం రైతుల అవస్థలు

వికారాబాద్: పంట రుణాల టార్గెట్‌ను పూర్తి చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా సగం రుణాలు కూడా ఇవ్వలేదు. వానాకాలం సీజన్‌లోనూ ఇదే పంథా కొనసాగించారు. పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే రూ. 5వేలు ఏ మూలకు సరిపోవడంలేదు. ఈ సారి రైతు బంధు డబ్బు కూడా అందరి ఖాతాల్లో జమకాలేదు. దీంతో అన్నదాతలు పంట రుణం కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అయోమయంలో అన్నదాత

జిల్లాలో 2.5లక్షల రైతులు ఉండగా 5.88లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. యాసంగి సీజన్‌లో 1.5 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తుంటారు. రైతులు సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా బ్యాంకర్ల నుంచి రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డబ్బు కోసం వడ్డీ వ్యాపారుల తలుపు తడుతున్నారు. బ్యాంకర్లు పంట రుణాలు ఇస్తారా? ఇవ్వరా? అనే దానిపై రైతులకు క్లారిటీ లేకుండా పోయింది. పంట రకాలను బట్టి ఒక్కో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి అవుతుండగా సాగు సాయం పేరుతో ప్రభుత్వం ఇచ్చే రూ. 5వేలు ఏ మాత్రం సరిపోవడం లేదని రైతులు అంటున్నారు.

లక్ష్యం చేరుకోవడంలో విఫలం

గృహ, వాహన, వ్యక్తిగత రుణాల విషయంలో లక్ష్యానికి మించి ఇచ్చే బ్యాంకర్లు పంట రుణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులకు అరాకొరా రుణాలు కూడా ఇవ్వడం లేదు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో 1,07,114 రైతు ఖాతాలు ఉన్నాయి. వీటిలో 83,136 మంది రైతులకు రుణాలు ఇచ్చారు. వానాకాలంలో రూ. 1,550 కోట్ల రుణం ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా సీజన్ ముగిసిన నాటికి రూ. 1,225 కోట్ల రుణాలే ఇచ్చారు. ఇక యాసంగి పంట రుణాల విషయంలో రూ. 1,532 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం రూ. 561 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇక దీర్ఘకాలిక రుణాల విషయంలో బ్యాంకర్లు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

టార్గెట్ పూర్తి చేస్తాం

వానాకాలం పంట రుణాల లక్ష్యం పూర్తి కాని మాట వాస్తవమే. అయితే యాసంగి సీజన్ ప్రారంభమైనందున త్వరలో రైతులకు రుణాలు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తాం. యాసంగికి సంబంధించి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణ ప్రణాళిక సిద్ధం చేశాం. సకాలంలో రుణాలు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. యాసంగి పంట రుణాల పంపిణీ టార్గెట్‌ను పూర్తి చేస్తాం.

– రాంబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్



నులిపురుగుల నివారణపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, ఇతర అధికారులు

నులిపురుగులను నివారించాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వయసువారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని కలెక్టర్ శశాంక వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని కోరుతూ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగలతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా నివారణ మాత్రలు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతిగృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోరబాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ మాత్రలు వేయాలని ఆయన సూచించారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు 8,09,357 మందికి 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1,774 మంది ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు క్యాంపెయిన్ ఉంటుందని.. 9 నెలల వయస్సు పిల్లలకు విటమిన్ ఏ ద్రావకం తాగించాలన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. మార్చి 3న పల్స్ పోలియో నిర్వహించాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ దిలిప్ కుమార్, డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

'పట్నం'తో ఎమ్మెల్యేకు ప్రమాదమే..

- పదవులు కట్టబెట్టిన పార్టీకే వెన్నుపోటు
- గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజుగౌడ్, నాయకులు

తాండూరు: పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబంతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రాజకీయంగా ప్రమాదం పొంచి ఉందని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్ ఆరోపించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుగౌడ్‌తో పాటు నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పార్టీ పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబానికి అధిక ప్రాధాన్యం కల్పించిందన్నారు. అందులో భాగంగానే ఆయనకు రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా పదవులు కట్టబెట్టిందన్నారు. మహేందర్‌రెడ్డి సతీమణి సునీతారెడ్డికి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, వికారాబాద్ జిల్లా చైర్‌పర్సన్‌గా మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారన్నారు. పట్నం కుటుంబానికి పార్టీ పెద్ద పీట వేసినప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికలలో మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ గెలుపు కోసం పని చేశారని ఆరోపించారు. కొడంగల్‌లో సొంత తమ్ముడినే ఓడించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పట్నం దంపతులు బీఆర్ఎస్ పార్టీని వీడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరితే తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇక నుంచి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు జమ చేయడంతో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ప్రజాపాలన కార్యక్రమం పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వాటిని తిరిగి సర్వేల పేరుతో ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తోందన్నారు. తాండూరును రోహిత్‌రెడ్డి అభివృద్ధి చేయలేదని వార్డు మెంబర్‌లుగా గెలవని నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పైలెట్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సంగీతాఠాగూర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, గౌతాపూర్ మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్, నాయకులు శ్రీనివాసచారి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మహాప్రభో..!

- కేజీబీవీ కాంట్రాక్టర్లకు 5నెలలుగా అందని సరుకుల బకాయిలు
- జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 2.05 కోట్లు పెండింగ్
- నిలిచిపోయిన పాలు, పండ్లు, గుడ్ల సరఫరా
- కూరగాయలు సైతం ఇవ్వలేమంటున్న టెండరుదారులు
- పరీక్షల సమయంలో విద్యార్థులకు అవస్థలు



యాలాలలోని కస్తూర్బా బాలికల వసతి గృహం

వికారాబాద్ అర్బన్: ఐదు నెలలుగా కేజీబీవీలకు సరుకులు సరఫరా చేసే టెండరు దారులకు బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో వారు సరుకుల సరఫరాను నిలిపివేస్తున్నారు. వారం రోజుల నుంచి కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాలకు పాలు, పండ్లు, గుడ్ల సరఫరాను నిలిపివేశారు. ఒకటి రెండు రోజుల్లో కూరగాయల సరఫరాను కూడా ఆపేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే విద్యార్థినులు పస్తులుండక తప్పదు. ఓ వైపు పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండగా, మరో వైపు ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సమయంలో చదువుపై శ్రద్ధ చూపాల్సిన విద్యార్థులు ఈ పూట ఆకలి తీరుతుందా లేదా అనే ఆలోచన చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

సెప్టెంబర్ నుంచి లేవు

కేజీబీవీలు, తెలంగాణ మోడల్ స్కూళ్లకు రోజువారిగా పాలు, గుడ్లు, కూరగాయల తోపాటు, వంట నూనె, ఉప్పు, కారం, పప్పులు వంటివి సరఫరా అవుతాయి. ప్రతి వస్తువుకు, కూరగాయలకు విడివిడిగా అధికారులు ఒక రేటు నిర్ణయించి, వీటి సరఫరాకు విద్యాశాఖ ద్వారా ఏటా టెండర్లను ఆహ్వానిస్తారు. అధికారులు నిర్ణయించిన ధర కంటే తక్కువ ధరకు కొటేషన్ వేసిన వారికి సరుకుల సరఫరా బాధ్యతలను అప్పగిస్తారు. జిల్లా అదనపు కలెక్టర్ సమక్షంలో ఈ టెండర్ల ప్రక్రియ సాగుతుంది. 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను టెండర్ ద్వారా వస్తువుల సరఫరా హక్కు దక్కించుకున్న వారు జూన్ నుంచి కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు, వంట సరుకులు సరఫరా చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తోంది. అయితే ఇప్పటి వరకు టెండరు దారులకు కేవలం మూడు నెలల బిల్లులు మాత్రమే వచ్చాయి. ఒక్కో హాస్టల్‌కు ఐదు నెలల బిల్లులు రావాల్సి ఉంది. ఇన్నాళ్లు అప్పులు చేసి విద్యార్థుల కడుపు నింపిన టెండరు దారులు ఇప్పుడు సరుకులు సరఫరాకు వెనుకాడుతున్నారు. లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎస్ఓలకు సమాచారం ఇస్తున్నారు.

ఇప్పటికే సరఫరా బంద్

జిల్లాలో 18 కేజీబీవీలు ఉండగా కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు, వంట సరుకులతో కలిసి అక్కడ ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం నెలకు రూ. 2లక్షల వరకు కేటాయించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో టెండరు దారులకు ఐదు నెలల బిల్లులు అంటే దాదాపు రూ. 5లక్షల పైగా రావాల్సి ఉంది. అధికారుల చుట్టూ తిరిగినా బిల్లులు మంజూరు కాకపోవడంతో వారం రోజుల నుంచి కొన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు పాలు, గుడ్లు, పండ్ల సరఫరాను ఆపేశారు. ఈ విషయం బయటకు రాకుండా అధికారులు, ఎస్ఓలు జాగ్రత్త పడుతున్నారు. బిల్లులు చెల్లిస్తేనే సరఫరా చేస్తామని టెండరు దారులు మొండికేశారు. ఇప్పటికీ అధికారులు స్పందించకుంటే ఈ శనివారం నుంచే మిగతా కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు కూరగాయలు సైతం సరఫరా చేయలేమని వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు.

రూ. 2,05 కోట్ల వరకు పెండింగ్

కేజీబీవీ టెండరు దారులకు ఐదు నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదు. జిల్లాలోని 18 కేజీబీవీలకు నెలకు రూ. 32 లక్షలు అవసరం కాగా, తెలంగాణ మోడల్ స్కూల్స్‌కు నెలకు రూ. 8 నుంచి రూ. 10 లక్షలు అవసరం అవుతున్నాయి. ఈ లెక్కన ఈ ఐదు నెలల కాలంలో కేజీబీవీలకు రూ. కోటి 60 లక్షలు, మోడల్ స్కూల్స్‌లో రూ. 45 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అప్పు చేసి సరఫరా



వడ్డీకి డబ్బు తెచ్చి కూరగాయలు, పండ్లు, పాలు సరఫరా చేశా. ఐదు నెలల నుంచి సరుకులు తెచ్చే షాపు యజమానికి డబ్బు ఇవ్వక పోవడంతో వారు సరుకులు ఇవ్వడం లేదు. నగదు పెట్టి కొనే స్తోమత మాకు లేదు. సకాలంలో బిల్లులు ఇవ్వక తీవ్రంగా నష్ట పోయాం. పిల్లల కడుపు మాడ్చాలని మాకు లేదు. మాకు ఉద్దేర వస్తువులే దొరకనప్పుడు మేం ఏం చేస్తాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలి.

– అనంతయ్య, టెండరుదారుడు

నిధులు రాగానే ఇస్తాం



ఐదు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే అందరికీ విడుదల చేస్తాం. అప్పటి వరకు టెండరు దారులు అన్ని వస్తువులు సరఫరా చేయాలని కోరుతున్నాం. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు నిధులు ఇవ్వాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరిగింది. త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– రేణుకాదేవి, డీఈఓ.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

యాలాల: పేకాట ఆడుతున్న నలుగురు జూదగాళ్లను పోలీసులు అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ శివారులో నలుగురు పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పేకాటరాయుళ్లతో పాటు రూ.14,100 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నారం గ్రామ శివారులో..

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో గురువారం రాత్రి పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా పేకాట ఆడుతున్న వారిని గుర్తించారు. 15 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.16,400 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

దోమ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన పి.నర్సింహులు(42) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. వెంటనే స్థానికుల సహాయంతో కుటుంబసభ్యులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సింహులు మృతికి కుటుంబ విషయాలే కారణమై ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుతుర్లు ఉన్నారు. దీనిపై ఎస్‌ఐ రవిగౌడ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


గణేశ్ (ఫైల్)

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని మల్‌శెట్టిపల్లి తండాకు చెందిన ఎం.గణేశ్(20) అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ స్రవంతి తెలిపిన వివరాల మేరకు.. తాండాకు చెందిన గణేశ్ స్థానికంగా కూలీ పనులు చూస్తుండే వాడు. ఈ నెల 2న ఇంట్లో నుంచి పనులకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడి అదృశ్యంపై ఆందోళనకు గురైన తండ్రి రవినాయక్ శుక్రవారం కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ స్రవంతి చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బైక్‌ను ఢీకొట్టిన ఆటో


వెంకట్‌రెడ్డి (ఫైల్)

నవాబుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దాతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసీస్ వెంకట్‌రెడ్డి(45) గురువారం రాత్రి స్వగ్రామం నుంచి నవాబుపేటకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో అజాగ్రత్తగా, అతి వేగంతో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డికి తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించా రు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యు లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య యాదమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్‌భూషణ్ తెలిపారు.

వాహనం ఢీకొని..

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని హన్మన్‌గండీ విద్యుత్ జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం గొల్లచెరువుకు చెందిన ఎండీ రజాక్(32) రాత్రి స్వగ్రామం నుంచి బైక్‌పై పూడూరుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పరిగి 220కేవీ సబ్ స్టేషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై సత్యనారాయణ మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ట్రాక్టర్ల కిస్తీ.. కట్టడానికి కుస్తీ!

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ల కొనుగోలు ప్రక్రియను చేపట్టింది. ఆర్థిక ఇబ్బందులను తట్టుకొని మరి చిన్న పంచాయతీలు ట్రాక్టర్లను విక్రయించాయి. ఆదాయ మార్గాలు లేక వాటి నిర్వహణ ప్రస్తుతం భారంగా మారింది. ప్రత్యేకాధికారుల ఏలుబడిలో ట్రాక్టర్ల నిర్వహణ ఏ మేరకు గాడిలో పడుతుందో చూడాలి.

- మోయలేని భారంగా గ్రామ పంచాయతీల నిర్వహణ
- పెరిగిన ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు
- సతమతమవుతున్న చిన్న జీపీలు
- బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు


దౌల్తాబాద్: ట్రాక్టర్‌లో చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

దౌల్తాబాద్: పల్లెల్లో పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరిసే ఉద్దేశంతో గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకుని కొన్న వాహనాలను చెత్త సేకరణకు ఉపయోగించారు. దీంతో పాటు హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందించడం, ఇతర పనులకు వినియోగిస్తున్నారు. మేజర్ పంచాయతీలు, అధిక పన్నులు వసూళ్లు చేసే జీపీల్లో ట్రాక్టర్ల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదు. చిన్న పంచాయతీల్లో మాత్రం నిర్వహణ భారంగా మారింది. డ్రైవర్ లేక కొన్ని, డీజిల్‌కు డబ్బులు లేక మరికొన్ని చిన్న చిన్న మరమత్తులు కూడా చేయించలేక కొన్ని... ట్రాక్టర్లను సరిగ్గా వినియోగించడంలేదు. కాగా ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగించడం ప్రత్యేకాధికారుల చేతుల్లోకి పంచాయతీలు వెళ్లడంతో వాహనాల నిర్వహణకు తర్జనభర్జన పడుతున్నారు.

డీలర్లతో కుమ్మక్కు

మండలంలో 33 జీపీలకుగాను పలు కంపెనీల ధరల ఆధారంగా ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 లక్షల నుంచి రూ.7లక్షల వరకు వెచ్చించారు. అయితే ఇందులో పెద్ద పంచాయతీలు, ఆదాయ వనరులున్న జీపీలు ఒకేసారి చెల్లించి కొనుగోలు చేశాయి. చిన్న పంచాయతీలు, తండాల పంచాయతీలకు బ్యాంకు రుణాలు తీసుకుని కొనుగోలు చేశాయి. ఈ క్రమంలో పలువురు అధికారులు ట్రాక్టర్ కంపెనీల డీలర్లతో కుమ్మక్కై ఉన్న ధర కన్నా అదనంగా రేటు వేసి కమీషన్లు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అయితే వచ్చీరాని పన్నులు, నిధుల లేమితో నెల నెలా బ్యాంకులకు కిస్తీలు కట్టేందుకు గత సర్పంచ్‌లు నానా అవస్థలు పడ్డారు.

బిల్లులు రాలేదు

పంచాయతీల వచ్చే రాష్ట్ర నిధులు, 15వ ప్రణాళిక సంఘం నిధులు జీపీల నిర్వహణలో సిబ్బందికి జీతాలు, కరెంట్ బిల్లులు చెల్లింపులకే సరిపోతున్నాయి. ఇక ట్రాక్టర్‌లకు నెలకు రూ.11వేల చొప్పున కిస్తీలు చెల్లించడానికి ఇబ్బందులు పడాల్సిందే. వీటికి తోడు గ్రామాల్లో చేపట్టిన డంపింగ్ యార్డులు శ్మశానవాటికలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదు. దీంతో అప్పుల్లో కూరుకుపోయిన సర్పంచ్‌లకు ట్రాక్టర్ల కిస్తీలు, నిర్వహణ, మరమత్తులు ఖర్చు, అదనపు భారంగా మారడంతో వాటిని మూలన పెట్టారు. అయితే అయితే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. కాగా పంచాయతీల పాలన ట్రాక్టర్ల నిర్వహణపై అధికారులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్లు పనిచేసేలా చూస్తాం

పంచాయతీల్లో చెత్త సేకరణ మొక్కల పెంపకం కీలకం. ఇందుకోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు తప్పకుండా నడిపించేలా చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ట్రాక్టర్ల నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారులు చూసుకుంటారు. మరమత్తులకు గురికాకుండా చర్యలు చేపడతాం.

– రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

విద్యార్థులకు అండగా ఏబీవీపీ


నూతన కమిటీతో జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏబీవీపీ పట్టణ కార్యవర్గాన్ని ఆ సంస్థ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు అధ్యక్షతన ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్గనైజేషన్‌గా కొనసాగుతోందని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. అనంతరం ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా పి.పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జె.అంజి, ఎం.నిఖిల్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.పవన్, ఖేల్ కన్వీనర్‌గా జి.కేశవులులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డి కన్వీనర్ మంజునాథ్‌రెడ్డి, వికారాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీశ్‌చారి పాల్గొన్నారు.

ఇరుకు గది.. ఇబ్బందులు పడి..!


ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓలు

వ్యవసాయశాఖ సిబ్బంది మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఓ ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖకు సొంత కార్యాలయ భవనం లేకపోవడంతో సింగిల్ విండో కార్యాలయంలోనే గత కొన్నేళ్లుగా మకాం వేశారు. అయితే దౌల్తాబాద్ క్లస్టర్‌కు మంజూరైన రైతువేదిక గ్రామానికి చివరగా చెరువుకట్ట దగ్గర నిర్మించడంతో అక్కడ సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారింది. అక్కడ విధులు నిర్వహిస్తే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే కార్యాలయాన్ని మార్చామని ఏఈఓలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోనే కార్యాలయ భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నారు. – దౌల్తాబాద్

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అవసరం

ఉమ్మడి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య


భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న అంజయ్య

పరిగి: భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఎంతో అవసరమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య అన్నారు. పట్టణంలో జన్ సాహస్, అంకిత ఫౌండేషన్ సహకారంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయన ఈ శిబిరాన్ని సందర్శించి కార్మికులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నందున కార్మికులకు ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంఘాల కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవంలో సంఘ సభ్యులు

పరిగి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయా సంఘాలు పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ సూచించారు. శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆ సంఘ భవనం ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పీఆర్టీయూకి పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యా సమస్యలపై ప్రభుత్వాలతో సమన్వయం చేస్తూ పీఆర్టీయూ పరిష్కరిస్తుందన్నారు. ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత సంఘానికి దక్కిందన్నారు. పీఆర్‌టీయూ ఎల్లప్పుడు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూ విద్యారంగాన్ని బలపరుస్తూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, మండల అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు గోపాల్, బుగ్గయ్య, వెంకటయ్య, ఉస్మాన్ అలీ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపై ఫోకస్

ఇప్పటికే సీఐలు ట్రాన్స్‌ఫర్స్

- ఎస్‌ఐలు, తహసీదార్లు, ఎంపీడీఓలకు స్థానచలనం
- ప్రక్షాళనపై ఎమ్మెల్యే నజర్


ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో తన మార్క్ పాలనపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి పెట్టారు. ముందుగా అనుకున్నట్టుగానే డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, హయత్‌నగర్, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐల బదిలీలు పూర్తయ్యాయి. త్వరలో అన్ని ఠాణా ఎస్‌ఐలను సైతం ట్రాన్స్‌ఫర్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని స్టేషన్లల్లో పరిధిలో ఎస్‌ఐలు సివిల్ తగాదాల్లో, అనవసర విషయాల్లో అతి జోక్యం చేసుకుంటున్నారని రాచకొండ సీపీకి ఫిర్యాదులు సైతం అందాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిఫారసు లేఖలతో బదిలీలపై వచ్చిన సీఐలు అప్పట్లో బీఆర్ఎస్ నేతలకే ప్రాధాన్యతనిస్తూ సామాన్య ప్రజల ఫిర్యాదులకు సైతం స్పందించే వారు కాదనే ఆరోపణలున్నాయి. పార్లమెంట్ ఎన్నికల లోపే ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయి బదిలీల్లో ఇబ్రహీంపట్నం ఏసీపీ సైతం బదిలీ అయ్యే అవకాశాలున్నట్లు అధికార పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

తహసీల్దార్లు, ఎంపీడీఓలు సైతం..

తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీలపై సైతం నజర్ వేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్లు పనిచేసిన ఎంపీడీఓ, తహసీల్దార్లను బదిలీలు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా లేని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచారు. డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఏ క్షణమైనా బదిలీ అవుతారనే చర్చలు జోరందుకున్నాయి. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఉన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో వారిని మార్చితే గ్రామ పరిపాలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఉన్నతాధికారులు భావిస్తున్నారట.

సార్.. మీ వద్ద పనిచేస్తాం

మహానగరంలో నివాసం ఉండి సరిహద్దు జిల్లాలైన నల్గొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పలు శాఖల అధికారులు నిత్యం ఎమ్మెల్యేను కలుస్తున్నారు. పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఈజీఎస్, డీఆర్‌డీఓ, వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్, మున్సిపల్ శాఖల్లో అధికారులు ఐదేళ్లకు మించి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. వారి స్థానంలో బదిలీపై వచ్చేందుకు పలు జిల్లాల్లో పనిచేసే ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునేందుకు క్యూ కడుతున్నారు. నిత్యం తొర్రూర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆ అధికారులే అధికంగా తచ్చాడుతున్నారు.

సిఫారసు లేఖలుండవు



ఆయా శాఖల అధికారులు సాధారణ బదిలీల్లోనే వస్తు, పోతున్నారు. ఏ ఒక్క అధికారిని తన పరిధిలోని మండలాల్లో విధులు నిర్వర్తించడానికి బదిలీ చేయమని ఏ ఉన్నతాధికారికి ప్రతిపాదనలు చేయలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని పక్కాగా అమలు చేసే అధికారులకే తన వద్ద స్థానం. అక్రమాలకు పాల్పడితే ఆ అధికారులే బాధ్యులు అవుతారు. ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే లక్ష్యం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సీజనల్ వ్యాధులపై అవగాహన


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ శరభలింగం అన్నారు. చౌడాపూర్ మండలం కిష్టంపల్లి గ్రామపంచాయతీలో ఓ యువతికి గురువారం డెంగీ వ్యాధి సోకడంతో అప్రమత్తమయ్యారు. శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలని, భోజనం చేసేముందుకు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. స్వచ్ఛతను పాటించడం వల్ల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి


సీఆర్పీల డైరీని ఆవిష్కరిస్తున్న కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి సీఆర్పీలు వినతిపత్రం అందజేశారు. సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. నెలవారి వేతనాలు, సమాన పనికి తగిన వేతనం, రెగ్యులరైజేషన్ తదితర సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం సీఆర్పీల డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సమగ్ర శిక్ష ఉద్యోగులు రాఘవేందర్, శ్రీనివాస్, శంకరయ్య, చంద్రశేఖర్, తిరుమలేశం తదితరులు పాల్గొన్నారు.

రాఘవన్‌నాయక్‌కు సంత్‌సేవాలాల్ అవార్డు



అనంతగిరి: బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అందించే సంత్ సేవాలాల్ మహారాజ్ నేషనల్ అవార్డుకు అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె.రాఘవన్ నాయక్ ఎంపికయ్యారు. ఈ నెల 11న ఆంధ్ర ప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేస్తున్న బహుజన సాహిత్య అకాడమీ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాఘవన్ నాయక్ గత 25 ఏళ్లుగా గిరిజన సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నారు. గతంలో వికారాబాద్ మండలం కొటాలగుడెం సర్పంచ్‌గా కూడా పనిచేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అవిశ్వాసానికి ముహూర్తం ఫిక్స్!

ఈ నెల 22న మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌పై అవిశ్వాసం తీర్మానం పెడుతూ 10 మంది కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసును అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి సంతకాల పరిశీలనను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. తదుపరి చర్యగా ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు, 2019 మున్సిపల్ చట్టం సెక్షన్ 37 ప్రకారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేశారు. మీటింగ్‌కు హాజరుకావాలని కలెక్టర్ జారీ చేసిన నోటీసులను స్థానిక అధికారులు కౌన్సిలర్లకు అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య ఆధ్వర్యంలో ఓటింగ్ నిర్వహించనున్నారు.

ఎవరి ధీమా వారిదే..

అవిశ్వాస తీర్మానంపై ఇరుపక్షాలు ధీమాగానే ఉన్నాయి. అయితే తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే ప్రతిపక్షాలకు మొత్తం 13 మంది సభ్యుల సహకారం లభించే అవకాశమే లేదని, అది వీగిపోవడం తప్పదని చైర్మన్ వర్గీయులు ధీమాగా ఉన్నారు. కౌన్సిలర్లకు అడిగినంత డబ్బు ఇవ్వనందునే అవిశ్వాస తీర్మానం పెడుతున్నారని, దీనిని రాబోయే రోజుల్లో ప్రజల వద్దనే తేల్చుకుంటామని పేర్కొంటున్నారు. అదేస్థాయిలో తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు ఇప్పటికే తమకు 12 మంది సభ్యుల బలం ఉందని, ప్రస్తుతం మరో ముగ్గురు ఓటింగ్‌లో పాల్గొని తమకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందని వారు ధీమాగా పేర్కొంటున్నారు.

మణికొండలో రివర్స్ గేర్..

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌కు చెందిన వారు చైర్మన్లుగా ఉండడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఆయా మున్సిపాలిటీల సభ్యులు కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసాలు పెడుతున్నారు. అందుకు భిన్నంగా మణికొండ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన చైర్మన్‌పైనే ప్రతిపక్షాలతో పాటు అదే పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. సదరు మున్సిపల్ చైర్మన్ ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి కావడంతో నియోజకవర్గవ్యాప్తంగా తీవ్ర చర్చానీయాంశంగా మారింది. ఈనెల 22న జరిగే సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా..? లేక వీగిపోతుందా..? అనే అంశంపై మున్సిపాలి టీ పరిధిలోని ఏ ఇద్దరు కలిసినా చర్చించుకుంటున్నారు.

పురుగు మందు డబ్బాతో రైతు నిరసన


పురుగుల మందు డబ్బాతో రైతు సత్తయ్య

మంచాల: పురుగు మందు డబ్బాతో ఓ రైతు మంచాల సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం హల్‌చల్ చేశాడు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిప్పాయిగూడకు చెందిన రైతు జెనిగె సత్తయ్యకు చెందిన బోరు బావి విద్యుత్ సమస్య కారణంగా సక్రమంగా పనిచేయడం లేదు. సమస్య పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను పలుమార్లు కోరినా స్పందించడం లేదని వాపోయాడు. వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో పురుగు మందు డబ్బాతో సబ్‌స్టేషన్ వద్దకు రావాల్సిన దుస్థితి వచ్చిందన్నాడు. గమనించిన ఏఈఈ సత్యనారాయణ వెంటనే మంచాల పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి రైతు సత్తయ్యను ఠాణాకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపించారు. ఇదే విషయమై విద్యుత్‌శాఖ ఏఈఈ వివరణ కోరగా సత్తయ్య పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆరు బోరు బావులకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కేవలం నాలుగు కనెక్షన్లున్నాయి. డీడీ కట్టిన రైతులకు కనెక్షన్ ఇస్తుండగా రైతు ఒప్పుకోకుండా పురుగు మందు డబ్బా తీసుకుని సబ్‌స్టేషన్‌కు వచ్చాడని తెలిపారు.